క్లుప్తంగా

విద్యార్థులకు టై, బెల్టుల ప్రదానం



వెల్దండ: మండల పరిధిలోని దేశిగానితండా ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు టై, బెల్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన సుమన్ సొంత ఖర్చులతో విద్యార్థులకు టై, బెల్టులు అందించడంతో విద్యార్థులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శోభ, కమల, పంతునాయక్, గ్రామస్తులు ఉన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలి



తిమ్మాజిపేట: గ్రామాలలో నిరక్షరాస్యులుగా ఉన్న వారిని గుర్తించి అక్షరాస్యులుగా మార్చేందుకు మహిళా సంఘాల సభ్యులు కృషి చేయాలని ఎస్‌ఆర్‌పీ మణికంఠ రావు పిలుపు నిచ్చారు. మండల కేంద్రం తిమ్మాజిపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం సెర్ప్ ఆధ్వర్యంలో వయోజనుల అక్షరాస్యతపై శిక్షణ నిర్వహించారు.

విద్యార్థులకు బస్‌సౌకర్యం కల్పించాలి

చారకొండ: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బస్ సౌకర్యంతో పాటు పాఠశాలలో సెమీ రెసిడెన్షియల్ విధానాన్ని అమలు చేయాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ మహరాజ్ అన్నారు. ధర్మసమాజ్ పార్టీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అద్దకి సునితకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాగార్జున, వెంకటేష్, మహేష్, తదితరులు ఉన్నారు.

స్కావెంజర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

కోడేరు: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లో మహిళా స్కావెంజర్ పోస్టు ఖాళీగా ఉందని ఎంఈఓ భాస్కర్‌శర్మ తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 15 నుంచి 18 వరకు ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం

తెలకపల్లి: వ్యక్తి అదృశ్యమైన సంఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. మండలంలోని గౌరెడ్డిపల్లికి చెందిన మన్నెం శ్రీరాములు కొంతకాలంగా మద్యానికి బానిసై ఊర్లో ప్రజలతో గొడవ పడుతూ తిరిగేవాడు. కుటుంబ సభ్యులు మందలించడంతో జూన్ 29 ఇంట్లో నుంచి చెప్పకుండా వెళ్లిపోయాడు. ఆచూకీ లభించకపోవడంతో అతను కుమారుడు రామక్రిష్ణ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు విద్యార్థి ఎంపిక

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తిలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో పెద్దకొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి లోకేష్ పరుగు పందెంలో మొదటి స్థానానికి ఎంపికయ్యాడు. రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బాలసుబ్రమణ్యం, ఎంఈఓ శ్రీనివాసురెడ్డి సోమవారం తెలిపారు. ఆగస్టు 3,4 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు హన్మకొండలో జరిగే పోటీలలో లోకేష్ పాల్గొంటారని వారు తెలిపారు. ఎంఈఓ అభినందించారు.

గెస్ట్ లెక్చరర్లను రెన్యువల్ చేయాలి

కందనూలు: డిగ్రీ కళాశాలలో బోధిస్తున్న గెస్ట్ లెక్చరర్లను వెంటనే రెన్యువల్ చేయాలని జిల్లా అధ్యక్షుడు దశరథం డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్న ఇప్పటి వరకు విధుల్లోకి తీసుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చారు.

పేకాట స్థావరంపై దాడి

ఉప్పునుంతల: మండలంలోని డిండి ప్రాజెక్టు దిగువన కట్ట మైసమ్మ ఆలయం సమీపంలోని మల్లారెడ్డి షెడ్డులో సోమవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.37 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ రెడ్యానాయక్ తెలిపారు. కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

ఆశాజనకంగా వానాకాలం సాగు

- చినుకు తడిచి చిగురించేను
- మూడు రోజులు కురుస్తున్న జల్లులు
- పంటలకు ప్రాణం పోసిన వర్షం
- ఊపందుకున్న వ్యవసాయ పనులు
- ఆనందంలో రైతులు



పత్తి పంటలో కలుపు తీస్తున్న రైతు కూలీలు

నాగర్‌కర్నూల్ రూరల్: మూడు రోజులుగా కురిసిన వర్షాలకు వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. 20 రోజుల తర్వాత వర్షాలు కురవడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. పంటలు దెబ్బ తింటున్న తరుణంలో వర్షా లు కురవడంతో పంటలకు ప్రాణం పోసినట్లయింది. వర్షం ఎప్పుడు వస్తుందా అని, నిత్యం ఆకాశం వైపు ఎదురుచూస్తున్న సమయంలో వర్షాలు పడడంతో రైతుల్లో సంతోషం వ్యక్తం మవుతోంది. మండలంలోని అన్ని గ్రామాల్లో వర్షాలు కురుస్తున్నందున వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి.



తాడూరు శివారులో పచ్చగా కళకళలాడుతున్న పంట

పత్తి సాగుకే ప్రాధాన్యత..

మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు పత్తి పంటకే ప్రాధాన్యత ఇస్తున్నారు. మండలంలో 42,600 ఎకరాలు సాగుకు అనుకూలంగా ఉండడంతో గ్రామాల వారీగా మండలంలోని 24 గ్రామాల్లో అత్యధికంగా మండల కేంద్రంలో 2520 ఎకరాలు కాగా, ఇంద్రకల్ 2450 ఎకరాలు, మొత్తం 24 గ్రామాల్లో 25,998 ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మొక్కజొన్న 185 ఎకరాలు, కందులు 40 ఎకరాల్లో సాగు కాగా, ప్రస్తుతం వరి సాగు లెక్క తెలాల్సి ఉందని అధికారులు తెలిపారు.

రైతుల్లో ఆశలు చిగురించాయి..

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రైతుల్లో ఆశలు చిగురించాయి. గత 20 రోజుల నుంచి వర్షాల జాడేలేదు. ఈ క్రమంలో జూలైలో మూడుసార్లు వర్షాలు కురవడంతో పంటలకు ప్రాణం పోసినట్లయింది. దీంతో రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. నాలుగు రోజుల నుంచి పత్తి పంటల్లో కలుపు తీసే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

ఎరువుల వాడకంపై శ్రద్ధ చూపాలి

రైతులు వేసిన వివిధ పంటల ఎదుగుదలపై, ఎరువుల వాడకంపై వ్యవసాయ అధికారులు ఇచ్చే సూచనలు సలహాలు పాటించాలి. అత్యధికంగా యూరియా వాడకం వల్ల దిగుబడి కోల్పోయే అవకాశం ఉంది. రైతులు పంటల సాగులో ఎలాంటి ఇబ్బందులు ఎదరైనా వ్యవసాయ అధికారులను సంప్రందించాలని అధికారులు తెలిపారు.

పంటలకు ప్రాణం పోసినట్లయింది..



మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పత్తి మొలకలకు ప్రాణం పోసినట్లయింది. వర్షాల అధారిత పంటలు సాగు చేస్తున్నాం. 6 ఎకరాలలో పత్తి పంట సాగు చేశాను. ప్రస్తుతం కురిసిన వర్షాలకు పంట చిగురించింది.

– కురుమూర్తి, రైతు, యాదిరెడ్డిపల్లి

అధికారుల సూచనలు పాటించాలి..

రైతులు వ్యవసాయం పరంగా ఎదుర్కొనే సమస్యలు మా దృష్టికి తెచ్చినట్లయితే సహాయ సహకారాలు ఉంటాయి. అధిక ఎరువులు వాడకం వల్ల దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ముందుగానే అయా రైతు వేదికల్లో పంటల సాగుపై అవగాహన కల్పించాం.

– సందీప్ కుమార్‌రెడ్డి, ఏఓ, నాగర్‌కర్నూల్

ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు



వెల్దండలోని ఎంపీ మల్లురవి జన్మదిన వేడుకలు చేస్తున్న నాయకులు

వెల్దండ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ కార్యకర్తలు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి కార్యకర్తలకు పంచారు. వృద్ధులకు, మహిళలకు పండ్లు పంపిణీ చేశారు.

బల్మూర్: మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, నా యకులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలో ఎంపీ మల్లురవి జ న్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు.

తెలకపల్లి: ఎంపీ మల్లురవి జన్మదిన మండల కేంద్రంలో కేక్ కట్‌చేసి ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు, వృద్ధులకు పంపిణీ చేశారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

కోడేరు: మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఎత్తం, నర్సాయిపల్లి పీఎస్ పాఠశాలలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధే ధ్యేయంగా ప్రతి పాఠశాలకు ఉచితంగా నోట్ పుస్తకాలతో పాటు పాఠ్యపుస్తకాలు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో మండలంలోని గంగారం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 400 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు సొసైటీ కో–ఆర్డినేటర్ గంగారం, హిందీ పండిత్ అశోక్ కుమార్‌లు అందజేశారు. ఉపాధ్యాయులు రాజారాం ప్రకాష్, రత్నశేఖర్, మహ్మద్, రాజప్ప, కోములయ్య, శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీహరిగౌడు, అనిత పాల్గొన్నారు.



నోట్‌పుస్తకాలతో విద్యార్థులు

రాజ్యాధికారం కోసం ఐక్య పోరాటం చేయాలి



పుస్తకావిష్కరణ చేస్తున్న రచయితలు

నాగర్‌కర్నూల్ రూరల్: బహుజనులు రాజ్యాధికారం కోసం ఐక్యపోరాటం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ముందు నెలపాడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ కవి రచయిత సాహిత్య అకాడమీ బీసీ కమిషన్ మాజీ సభ్యులు జూలూరి గౌరిశంకర్ రచించిన బహుజనగణమణ దీర్ఘ కవిత పుస్తకాన్ని కవులు, రచయితలు, ఉద్యమకారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాజీ జెడ్పీటీసీ శ్రీశైలం, వెంకట్‌రాములు, విద్యావేత్త భాస్కరరావు, సీపీఎం నాయకులు ఆర్.శ్రీనివాసులు, నెలపాడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు సుబ్బయ్య, కాశన్న, శరత్, విరన్న, రఘు రాములుగౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు కందికొండ మోహన్, మద్దిలేటి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

కల్వకుర్తి రూరల్: మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను కల్వకుర్తిలో తిరగనివ్వం అంటూ మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విజయ్ గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షాహిద్‌లు తప్పు పట్టారు. కల్వకుర్తిలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఉప్పునుంతల: మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆలూరి తిర్పతయ్య కుటుంబానికి సోమవారం అతని స్నేహితులు (1993–94 బ్యాచ్) కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. రూ.16 వేలు నగదుతో పాటు నిత్యవసర సరుకులు అందజేశారు. లక్ష్మీకాంత్, నజీర్, శ్రీనివాసులుగౌడ్, ఖాసీం, మల్లయ్య, వెంకటేష్, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఈశ్వర ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళా ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తాం

అచ్చంపేట రూరల్: మహిళలు ఆర్థికంగా ఎదగడానికి తమ వంతుగా కృషి చేస్తున్నామని ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ శ్రీశైలం రీజియన్ (ఏటీఎల్) ఇన్‌చార్జి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సింగారం గ్రామంలో తుంపరసేద్యంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా రైతులకు పోత్సహించేందుకు సేంద్రియ వ్యవసాయంపై త్వరలో శిక్షణ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, రవీందర్, రమేష్, చిన్న అంజనయ్య, శేఖర్, రేణయ్య, భారతమ్మ, దస్లీ, తిరుపతమ్మ, పద్మమ్మ పాల్గొన్నారు.

‘భూమిని సాగు చేసుకోనివ్వండి’

మన్ననూర్: దశాబ్దాల కాలంగా స్వాధీనంలో ఉన్న కండ్లకుంటలోని భూమిని సాగు చేసుకునే అవకాశం ఇవ్వడంతో పాటు మాకు సొంతం చేయాలని డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డిని ఆదివాసి చెంచులు మొరపెట్టుకున్నారు. సోమవారం అమ్రాబాద్ మండలం జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చెంచులు మన్ననూర్‌లోని ఎఫ్‌డీఓ కార్యాలయం వద్ద బైఠాయించారు. కార్యాలయం ఆవరణలో చెంచు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి నాగయ్య, ప్రజా సంఘాల నాయకులు లక్ష్మీనారాయణ, వెంకటేష్, ఎల్లస్వామిలు డీఎఫ్‌ఓతో మాట్లాడారు. కార్యక్రమంలో కమలేశ్వర్, చెన్నయ్య, ఉసేన్, వెంకటేశ్, దాసరి బాలయ్య, వెంకటయ్య, మహిళలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన విద్యుత్ ఉప కేంద్రంలో నూతన కనెక్షన్లు ఇస్తునందున మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వివరించారు. రైతులు, విద్యుత్తు వినియోగదారులు విషయం గమనించాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

పెద్దకొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయలేదని సీపీఐ కార్యవర్గ సభ్యులు విజయుడు అన్నారు. పెద్దకొత్తపల్లిలో సోమవారం సీపీఐ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కుర్మయ్య, యేసయ్య, నర్సింహ, శ్రీనివాసులు, మల్లేష్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

‘మా పేరిట ఎలాంటి భూములు లేవు’

నాగర్‌కర్నూల్ క్రైం: చిట్టీల పేరిట రైతులను మోసం చేసిన సాయిబాబకు తమకు ఎలాంటి సంబంధం లేదని తమ పేరిట ఎలాంటి భూములు లేవని రేవల్లి మండలం నాగపూర్ గ్రామానికి చెందిన నాగం కరుణాకర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయిబాబ చిట్టీలు, ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్న క్రమంలో నాగపూర్ గ్రామానికి చెందిన కొందరు ఖాతాదారులు తనను సంప్రదిస్తే మధ్యవర్తిగా వ్యవహరించి మాట్లాడమని, డబ్బులు ఇవ్వకుంటే అతనికి ఉండే వ్యవసాయ భూములను ఖాతాదారులకు రిజిస్ట్రేషన్ చేశాడని తెలిపారు. కొందరు వ్యక్తులు అనవసరంగా తమ పేరిట సాయిబాబకు చెందిన ఆస్తులు ఉన్నాయని ప్రచారం చేస్తు యూ ట్యూబ్ చానళ్లు, సోషల్‌మీడియాలో ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

పాలెం విద్యార్థికి రాష్ట్ర స్థాయి 4వ ర్యాంకు

బిజినేపల్లి: పాలెం శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఏ లిటరేచర్ పూర్తి చేసుకున్న నిహారిక హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో తెలుగు విభాగంలో రాష్ట్రస్థాయి 4వ ర్యాంకు సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.రాములు సోమవారం ఒక ప్ర కటనలో తెలిపారు. వట్టెం గ్రామానికి చెందిన సీతారాములు కుమార్తె నిహారికకు రాష్ట్రస్థాయి ర్యాంకు రావడంతో కళాశాల అధ్యాపక బృందం సన్మానించి గౌరవించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించాలి

తెలకపల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించాలని స్వేరోస్ నాయకులు శివశంకర్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వతరగతి ఫలితాలు వెలువడి దాదాపు 3నెలలు గడుస్తున్న గురుకుల కళాశాలలో పూర్తి స్థాయిలో అడ్మిషన్లు కాలేదన్నారు. గతంలో ఇచ్చిన ఆన్‌లైన్ దరఖాస్తు చేసిన ఆన్‌లైన్‌లో అప్లికేషన్ చేసుకోలేదన్నారు. విద్యార్థులకు గురుకులంలో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంపత్‌కుమార్, ఆంజనేయులు, లక్ష్మయ్య, సురేష్ పాల్గొన్నారు.

దీక్షలకు సంఘీభావం

కొల్లాపూర్: ఇళ్ల స్థలాల సాధన కోసం కొల్లాపూర్‌లో జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 20వ రోజుకు చేరాయి. జర్నలిస్టుల దీక్షలకు సోమవారం బీజేపీ రాష్ట్ర నాయకులు ధా రాసింగ్ సంఘీభావం ప్రకటించారు. దీక్షలకు బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకులు శేఖర్‌గౌ డ్, మండల అధ్యక్షుడు కేతూరి నారాయణ, నాయకులు కాడం శ్రీనివాస్, చెన్నయ్య, చంద్రయ్య సంఘీభావం ప్రకటించారు.

స్థానిక ఎన్నికల్లో విజయఢంకా మోగిద్దాం

- ఎమ్మెల్యే వంశీకృష్ణ

వంగూరు: సమిష్టిగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘనవిజయం సాధించాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలో అనేక హామీలను అమలు చేసిందని, వాటన్నింటినీ పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశాలు ఎవరికి వచ్చినా అందరూ సహకరించి విజయం సాధించాలన్నారు. ఏకగ్రీవంగా ఎన్నిక జరిగిన గ్రామాలకు రూ.20 లక్షలు అభివృద్ధి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. త్వరలో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు జరుగనున్నాయని, కార్యకర్తలంతా సన్నద్ధం కావాలన్నారు. ఇళ్లు, రేషన్‌కార్డులు, కార్డులలో మార్పులు చేర్పుల ప్రక్రియను చేపట్టడం జరిగిందన్నారు. రైతు భరోసా, రైతులకు సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అల్వాల్‌రెడ్డి, రమేష్‌గౌడ్, క్యామ మల్లయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, వేమారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ప్రొసీడింగ్‌లు అందిస్తున్న నాయకులు

చారకొండ: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబాన్ని గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి నాయిని జైపాల్ అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాయిపల్లిలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి, హౌసింగ్ ఏఈఓ ముగ్గుపోసి ప్రారంభించారు. లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీపతిరావు, యాదయ్య, ప్రభాకర్ రావు, రాజేష్‌గౌడ్, వెంకటయ్య, నవీన్, మనుమంత్, రామస్వామి, రాములు తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్యంపై శ్రద్ధ అవసరం

తాడూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పారిశుద్ధ్యం కార్యక్రమాల్లో ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని స్వచ్ఛ సర్వేక్షన్ టీం సభ్యులు వెంకటేష్, లింగమయ్య పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తిర్మలాపూర్, ఇంద్రకల్ గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆయా గ్రామాలలో స్వచ్ఛసర్వేక్షన్ కార్యక్రమంలో చేపట్టిన పనులను పరిశీలించారు. ఇంకుడు గుంతలు, మురికి కాల్వల నిర్వాహన, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, వివిధ పరిసరాలను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ నర్సింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో పారిశుద్ధ్యంపై తీసుకునే చర్యలు వివరించారు. ఏపీఓ చంద్రసిద్ధార్థ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఇంద్రకల్‌లో నిర్మించిన ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న టీం సభ్యులు

బోరు మోటార్లు చోరీ

తిమ్మాజిపేట: మండలంలోని నేరళ్లపల్లి గ్రామానికి చెందిన ఇద్దరి రైతుల వ్యవసాయ బోరుమోటార్లు చోరీకి గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన రైతులు మీసాల నాగయ్య, మీసాల వెంకటయ్య వరి పంట వేసుకునేందుకు కెఎల్‌ఐ కాలువలో వ్యవసాయ బో రు మోటార్లను బిగించారు. 12 వరకు బోరు మోటార్లు ఉన్నాయని, 13 ఆదివారం వెళ్లి చూడగా రెండు వ్యవసాయ మోటర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు రైతులు గుర్తించారు. రెండు వ్యవసా మోటర్ల విలువ 70 వేల వరకు ఉంటుందని వారు పెర్కోన్నారు. చుట్టు పక్కల ఎక్కడ వెతికిన దొరకక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతులు తెలిపారు. ఇప్పటికైనా పోలీసులు తగిన చర్యలు తీసుకోవలని గ్రామ రైతులు కోరుతున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం/తాడూరు: మద్యం తాగి వాహనం న డుపుతూ పోలీసులకు పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు సోమవారం జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐలు గోవర్ధన్, గురుస్వామి తెలిపారు. వనపర్తి జిల్లా ఏదుల గ్రామానికి చెందిన యాదగిరి మద్యం తాగి వాహనం నడుపుతుండగా డ్రంకెన్‌డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడ్డాడు. తాడూరు సమీపంలో మల్కాపూర్ గేటు వద్ద చేపట్టిన వాహనాల తనిఖీలో వెస్టు గోదావరి జిల్లా అనంతపల్లి గ్రామానికి చెందిన ము క్కిరాల కిషోర్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. పోలీసులు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శృతిధూత యాదగిరికి మూడు రోజులు, కిషోర్‌కు ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

భర్తపై భార్య ఫిర్యాదు: కేసు నమోదు

బల్మూర్: తాగుడుకు బానిసై నిత్యం వేధింపులకు గురి చేయడమే కాకుండా దాడి చేసి గాయపర్చిన భర్తపై భార్య ఫిర్యాదు చేయడంతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మంగళకుంటపల్లి గ్రామానికి చెందిన కాళ్ల కాశన్న, బాలమ్మలు భార్యాభర్తలు. వారికి 30 ఏళ్ల క్రితం వివాహం కాగా, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. తాగుడుకు బానిసైన కాశన్న తరచు భార్యతో పాటు పిల్లలపై దాడి చేసేవాడు. ఈ క్రమంలో 12న భార్య బాలమ్మపై కాశన్న ఇనుప రాడ్‌తో దాడి చేయడంతో తల, కాలికి తీవ్ర రక్త గాయాలు కాగా ఆస్పత్రికి తరలించా రు. అనంతరం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బల్మూర్: మండలంలోని కొండనాగుల సమీపంలో అచ్చంపేట ప్రధాన రహదారిపై ఈనెల 13న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడినట్లు ఎస్‌ఐ రాజేందర్ సోమవారం తెలిపారు. అచ్చంపేటకు చెందిన మధునాగుల రమేష్ ద్విచక్ర వాహనంపై కొండనాగుల నుంచి అచ్చంపేటకు వెళ్తుండగా దొంతికుంట మైసమ్మ గుడి ఎదురుగా ఆటోను ఢీకొట్టాడు. దీంతో బోల్తాపడి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సంఘటనపై బాధితుని సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మౌలిక వసతులు కల్పించాలి

వెల్దండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించాలని సోమవారం ప్రభుత్వ పాఠశాలలను పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు సంతోష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈదమ్మబండతండా, చల్లపల్లి, బొల్లంపల్లిలోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పరిశీలించారు.

పీఆర్‌సీ అమలు చేయాలి

అచ్చంపేట రూరల్: ఉద్యోగులకు పాత పింఛన్ పునరుద్ధరించి పీఆర్‌సీ అమలు చేయాలని బహుజన ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గాజుల వెంకటేష్ డిమాండ్ చేశారు. అచ్చంపేటలో బీటీఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రవీందర్, శ్రీనివాసులు, భూపతి కుమార్, రంజిత్, నాగరాజు పాల్గొన్నారు.

విద్యా కోఆర్డినేటర్లకు దరఖాస్తులు చేసుకోవాలి

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యా కోఆర్డినేటర్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సోమవారం జోనల్ ఇన్‌చార్జి సూగూరి శ్రీరామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేమాతరం ఫౌండేషన్, శృతిలయ కల్చరల్ అకాడమీ, మై విలేజ్ మోడల్ విలేజ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో కలాం ఎక్సలెన్స్ ఆఫ్ ట్యూషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు ఆసక్తిగల యువతీ యువకులు ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9542518850 సంప్రదించాలన్నారు.

మల్లన్నపై దాడి సరికాదు

కల్వకుర్తి రూరల్: ఎన్నో సంవత్సరాలుగా బీసీ సంఘాల నాయకులు, వివిధ సంఘాల పోరాట ఫలితమే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం వాటా ఇచ్చేందుకు ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసిందని బీసీ సంఘం నాయకులు తెలిపారు. శాసనమండలి సభ్యుడు తీన్మార్ మల్లన్నపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్ద యాదవ్, బీసీ సబ్ ప్లాన్ సాధన సమితి నియోజకవర్గ కన్వీనర్ మేకల రాజేందర్, బీసీ సంక్షేమ యువజన సంఘం జిల్లా కార్యదర్శి శివప్రసాద్‌లు సోమవారం వేరువేరుగా ఖండించారు.

పదోన్నతులు కల్పించాలి

వెల్దండ: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు వెంటనే కల్పించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీధర్‌శర్మ పేర్కొన్నారు.మండలంలోని ఆయా పాఠశాలల్లో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు నిర్వహించారు. కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు.

లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలి



తెలకపల్లి: విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని చదవాలని ప్రేరణాత్మక వక్త హర్షకిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని కేకేరెడ్డి పాఠశాలలో 9,10 తరగతి విద్యార్థులకు ప్రేరణాత్మక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హర్షకిరణ్ మాట్లాడుతూ క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని చదివితే ఉన్నత స్థానం పొందుతారన్నారు. అనంతరం హర్షకిరణ్‌ను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కార్తీక్‌కుమార్, బాలు, పాష, కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.